క్లుప్తంగా

మంత్రి బుగ్గనను సత్కరించిన మద్దిలేటి స్వామి ఆలయ ఈఓ



స్వామివారి చిత్ర పటం అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి ఆలయ నూతన ఈఓగా బాధ్యతలు చేపట్టిన రామాంజనేయులు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి బుగ్గనను స్వగృహంలో సత్కరించి, స్వామి వారి చిత్ర పటాన్ని ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు అందజేశారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి బుగ్గన చర్చించారు

జోరుగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్



పేరుసోముల సచివాలయంలో ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న మహిళ

సంజామల: జగనన్న కాలనీలకు చెందిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మండలంలో జోరుగా సాగుతుంది. మండలంలోని 11 సచివాలయాలలో సిబ్బంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. మండలంలో 1332 మంది లబ్ధిదారులు ఉండగా 1,110 మందికి ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించి 83 శాతం పూర్తి చేశామని ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు.

మహిళలు జీవనోపాధి మార్గాలు ఎంచుకోవాలి



సర్టిఫికెట్‌లు అందజేస్తున్న మీనాక్షి

కొలిమిగుండ్ల: మహిళలు జీవనోపాధి మార్గాలు ఎంచుకొని కుటుంబ పోషణకు దోహదపడాలని అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీకి చెందిన వసుంధర, లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు మీనాక్షి తెలిపారు. అంకిరెడ్డిపల్లెలో మూడు నెలల పాటు మగ్గం వర్క్‌పై మహిళలకు ఇచ్చిన శిక్షణ పూర్తి కావడంతో గురువారం సర్టిఫికెట్లను వారు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు ఇళ్లలోనే కుట్లు, అల్లికలు, టైలరింగ్‌తో పాటు ఎన్నో రకాల కుటీర పరిశ్రమలు నెలకొల్పుకోవచ్చన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ కిరణ్‌బాబు



అవుకు: అవుకు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా గురువారం కిరణ్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న విష్ణునారాయణను ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపగా ఆయన స్థానంలో కర్నూలు జిల్లా మాదవరం పీఎస్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కిరణ్‌బాబు ఇక్కడికి వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమవంతు కృషి చేస్తామని, ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్ఐ కిరణ్‌బాబు కోరారు.

నేడు కలుగొట్లలో ఆరోగ్య సురక్ష

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్ల గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం రెండవ విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు రేవనూరు డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు వివిధ జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సచివాలయ పరిధిలోని ఆయా కాలనీల ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు వలంటీర్లకు సన్మానం

బనగానపల్లె రూరల్ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోని పొదుపు భవనంలో శుక్రవారం వలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన ఉదయం జరిగే ఈ సన్మాన కార్యక్ర మానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వలంటీర్లను సన్మానిస్తారన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొని కార్యక్రమా న్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

నేటి నుంచి ఉరుసు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ ఎస్ రంగాపురంలో వెలసిన శ్రీ సయ్యద్ షా అల్లాబకాష్ ఖాద్రీ స్వామి ఉరుసు ఉత్సవాలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు దర్గా ముజావర్ సయ్యద్ హిదాయత్ అలీ, గ్రామ పెద్దలు తెలిపారు. 16న గంధం, 17న ఉరుసు, 18న జియారత్ వేడుకలు ఉంటాయన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని 17న ఏపీ, తెలంగాణా రాష్ట్రాల స్థాయి కబడ్డీ, పాలపండ్ల బండలాగు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ విజేతలకు రూ. 35 వేలు, రూ. 20 వేలు, రూ. 10 వేలు, రూ. 6వేలు చొప్పును బహుమతులను అందజేస్తామన్నారు. విజేత వృషభాల యాజమాన్యాలకు రూ. 20 వేలు, రూ.10 వేలు, రూ.5వేలు చొప్పున బహుమతులను అందజేస్తామని వివరించారు.

వెలగటూరు...వెలుగులు!

- రూ. 2.11 కోట్లతో గ్రామాభివృద్ధి
- ప్రతి కాలనీలో మెరుస్తున్న సీసీ రోడ్లు
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఆయకట్టు రహదారుల ఏర్పాటుతో అన్నదాతకు తీరిన కష్టాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణానికి రెండు కిమీ దూరంలో ఉన్న చిన్నపాటి గ్రామమైన వెలగటూరుకు సకల మౌలిక వసతులు సమకూరడంతో వెలుగుతోంది. పట్టణానికి సమీపానున్నప్పటికీ కనీస వసతులకు కరువైన ఆ గ్రామం నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. బిజినవేముల సచివాలయ పరిధిలోని వెలగటూరు గ్రామంలో రూ. 2.11 కోట్లతో చేపట్టిన వివిధ పనులు గ్రామాభివృద్ధికి అద్దం పడుతున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో వెలగటూరు అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచింది. తాగునీరు, సీసీరోడ్లు, డ్రైనేజీ, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పొలాలకు వెళ్లే రహదారులు తదితర మౌలిక సదుపాయాల కల్పనతో గ్రామస్తుల శాశ్వత కష్టాలు తీరిపోయాయి. మౌలిక సదుపాయాల కల్పనతో ఏళ్ల తరబడి గ్రామస్తులు ఎదుర్కొంటున్న కష్టాలు తీరాయి. ప్రత్యేకించి రోడ్లు అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. ఇక వర్షం కురిస్తే కష్టాలు వర్ణనాతీతం. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు బురదలో నడిచేందుకు అవస్థలు పడేవారు. ప్రస్తుతం సీసీరోడ్ల నిర్మాణంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. మెయిన్‌రోడ్డుతో పాటు బీసీ, ఎస్సీ కాలనీలకు జాతీయ ఉపాధి హామీ పథకం, గడప గడపకు మనప్రభుత్వం, ఎంపీ నిధులతో ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన సీసీరోడ్లతో మెరిసిపోతున్నాయి. గ్రామంలో నుంచి వచ్చే మురుగునీటికి బయటకు తరలించేందుకు ఊరివాకిలి నుంచి జుర్రేరువాగు వరకు డ్రెయినేజీ ఏర్పాటు చేశారు. మినరల్‌వాటర్‌ప్లాంట్‌ను అందుబాటులోకి రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు వెలగటూరు ప్రజలు. తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు జలజీవన్ మిషన్ ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంకు, పైప్‌లైన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రైతులు పొలాలకు వెళ్లేందుకు అయకట్టు రోడ్లు లేక అవస్థలు పడుతుండటంతో యాల్లాగు, కుమ్మరిగుండయ్య, నడిమిచేలకు వెళ్లే రోడ్లలో మూడు చోట్ల కల్వర్టుల నిర్మాణంతో గ్రావెల్‌రోడ్లు నిర్మించడంతో రైతుల కష్టాలు తీరిపోయాయి. గ్రామ పంచాయతీ, మండల పరిషత్ నిధులతో ఊరివాకిలి, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేశారు. చిన్నపాటి గ్రామంలో రూ. 2.11 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితోపాటు సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



రూ. 21.50 లక్షలతో ప్రారంభానికి సిద్ధంగా వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనం



గ్రామంలో మెరుస్తున్న సీసీరోడ్డు

గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు

- రూ. 58 లక్షలతో పొలాలకు వెళ్లే రస్తాలు, కల్వర్టుల నిర్మాణం
- రూ. 38 లక్షలతో ఎస్సీ, బీసీ కాలనీలతో పాటు సీసీరోడ్లు
- రూ. 35 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు, పైప్‌లైన్ నిర్మాణం
- రూ. 21.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనం నిర్మాణం
- రూ. 17 లక్షలతో సర్కారు బడికి సరికొత్త హంగులు
- రూ. 17 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రానికి మౌలిక వసతులు
- రూ. 10 లక్షలతో ఊరివాకిలి నుంచి జుర్రేరు వాగు వరకు డ్రైనేజీ నిర్మాణం
- రూ. 5 లక్షలతో మినరల్‌వాటర్ ప్లాంట్
- రూ. 4 లక్షలతో ఊరివాకిలి అభివృద్ధి
- రూ. 4 లక్షలతో గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం



రూ. 5 లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్



రూ. 35 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు

ఆయకట్టు రోడ్లతో తీరిన కష్టాలు



పొలాలకు వెళ్లేందుకు ఆయకట్టు రోడ్లు లేక గతంలో ఇబ్బందులు పడ్డాం. రసాయన ఎరువులు, పంట ఉత్పత్తులు, పశుగ్రాసం తరలించుకునేందుకు అగచాట్లు తప్పేవికాదు. వర్షాకాలంలో పొలాలకు వెళ్లాలంటే నరకయాతనగా ఉండేది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో రూ. 58 లక్షలతో పొలాలకు వెళ్లే రోడ్లను బాగు చేయడంతో రైతులకు కష్టాలు తీరిపోయాయి. ఎమ్మెల్యే కాటసానికి ప్రత్యేక కృతజ్ఞతలు.　– మాధవరెడ్డి, రైతు, వెలగటూరు

వైద్య సేవలు అందుబాటులోకి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. మా గ్రామంలో రూ. 21 లక్షలతో హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశారు. వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ సాయం మరువం.　– నవీన్, వెలగటూరు

అన్ని వసతులు కల్పించాం



గ్రామంలోని ప్రతి కాలనీకి అన్ని వసతులు కల్పించాం. 2013 నుంచి సర్పంచ్‌గా పనిచేస్తున్నా. గతంలో సొంత నిధులతో ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి వసతి కల్పించా. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశా. సీసీరోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, ఆయకట్టు రోడ్ల నిర్మాణా నికి ప్రాధాన్యత ఇచ్చాం. రాబోయే రోజుల్లో గ్రామా న్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా.　– ఎల్వీ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్, వెలగటూరు

గెస్ట్ హౌస్ ఆధునీకరణ పనులు పరిశీలించిన మంత్రి



ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్ జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపాన రూ. 78 లక్షలతో చేపట్టిన ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆధునీకరణ పనులను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా పనులు పురోగతిపై కంట్రాక్టర్, ఆర్‌అండ్‌బీ అధికారులతో మంత్రి చర్చించారు. పనులు నాణ్యతగా చేపట్టడమే కాకుండా వేగవంతం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు మంత్రి సూచించారు. కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి, మంత్రి ఓఎస్డీ ప్రతాప్ రెడ్డి, సీఐ ప్రీతం రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన భజన పోటీలు

కొలిమిగుండ్ల: పెట్నికోట ఎస్సీ కాలనీలో సీతారాముల విగ్రహాల ప్రతిష్టను పురష్కరించుకొని బుధవారం రాత్రి ప్రారంభమైన రాష్ట్ర స్థాయి భజన పోటీలు గురువారం ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి 35 భజన బృందాలు పోటీల్లో పాల్గొన్నాయి. న్యాయనిర్ణేతలుగా కర్నూలుకు చెందిన రామలింగయ్య, తెలంగాణ నుంచి సోమన్న, రాజబాబు, హైదరాబాదుకు చెందిన సత్తెన్న వ్యవహరించారు. అనంతపురం జిల్లా గుర్రంపాడు, అదే జిల్లా పెద్దవడుగూరుకు చెందిన లక్ష్మంపల్లె, మరూరు, కూచివారిపల్లె భజన బృందాలు వరుసగా నాలుగు స్థానంలో నిలిచారు. వీరికి వరుసగా రూ.30వేలు, రూ.25వేలు,రూ.20వేలు,రూ.15వేల నగదు బహుమతులు అందించారు. దాతల సహకారంతో 23 బహుమతులను భజన బృందాలకు మొత్తం రూ.2.03లక్షల నగదు బహుమతులు అందజేశారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న శ్రీరాములు

డోన్ : సీఎం రిలీఫ్ ఫండ్‌తో నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఆర్థిక ఉపశమనం కలుగుతుందని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు తెలిపారు. డోన్ పట్టణం పాతపేటకు చెందిన వెన్నెల రాజు యాదవ్, సుబ్బలక్ష్మిల కుమార్తె పెన్నేర మౌనిక అనారోగ్యంతో బాధపడుతుంది. స్పందించిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరు చేయించిన రూ.5లక్షల చెక్కును గురువారం ఆయన బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, కోఆప్షన్ చైర్మన్ రఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు దుబాయ్ శ్రీను, కుమార్, ఆది, షేక్షా, సమీర్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా సైనికులు వీరే...

డోన్ టౌన్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా ఉత్తమ సేవా సైనికుల్లా అంకితభావంతో పాటుపడుతున్న వలంటీర్లను గుర్తించిన అధికారయంత్రాంగం వారిని అభినందించేందుకు వందనం కార్యక్రమం నిర్వహించనుంది. ఇందులో భాగంగా పట్టణంలోని తారకరామ నగర్ సచివాలయం పరిధిలో వలంటీర్లుగా పని చేస్తున్న సునిత సేవా వజ్రగా, సచివాలయం కార్యదర్శి ఆలా రమేష్, వలంటీర్ బోయ సుమలత సేవా రత్నగా ఎంపిక అయ్యారు. అలాగే నవ రత్నాల లబ్ధిదారుల జీవన ప్రమాణాలపై వలంటీర్ షేక్ మైమున్నీషా తీసిన వీడియో ఎంపికయినట్లు అధికారులు తెలిపారు. వీరికి సేవా వజ్ర కింద రూ.45వేలు, సేవా రత్నకు రూ.30వేలు,సేవా మిత్రకు రూ.15 నగదు పోత్రాహాలు అందించనుంది. అలాగే ఉత్తమ వీడియోగా ఎంపికైన వాటికి రూ.25వేల నగదు ప్రోత్సాహాన్ని త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది.



ఉత్తమ సచివాలయం కార్యదర్శి ఆలా రమేష్



సేవా వజ్రకు ఎంపికైన వలంటీర్ సునీత



సేవా రత్నకు ఎంపికైన బోయ సుమలత



ఉత్తమ వీడియో పంపిన షేక్ మైమున్నీషా

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన జడ్జీ తంగమణి

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను గురువారం సీనియర్ సివిల్ జడ్జి తంగమణి తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, తరగతి గదులను, వంట శాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హాజరుశాతం, చదువుపై ఏలాంటి శ్రద్ధ కనబరస్తున్నారు, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల వివరా లను ప్రిన్సిపాల్ గీతను జడ్జి అడిగి తెలుసుకున్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జడ్జి తంగమణి

అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపాం

- బనగానపల్లె నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశాం
- గడప గడప హామీలన్నీ అమలు పరిచాం
- అభివృద్ధిని ఓర్వలేక టీడీపీ నాయకుల విమర్శలు
- రూ. 10.94 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని



మెయిన్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని

కోవెలకుంట్ల: సంక్షేమంతోపాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిచ్చి బనగానపల్లె నియోజకవర్గాన్ని నంద్యాల జిల్లాలో అగ్రగామిగా నిలిపామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో రూ. 10.94 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం సాయంత్రం ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి, జెడ్పీటీసీ గోపిరెడ్డి వెంకటలక్షుమ్మ, సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి తదితర నాయకులతో కలిసి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించారు. ముదిగేడు చౌరస్తా నుంచి జమ్మలమడుగు టర్నింగ్ వరకు రూ. 8 కోట్లతో విస్తరించిన సీసీరోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్, రూ. కోటితో నిర్మించిన చౌడమ్మ గుడి నుంచి పట్టణ శివారు వరకు నిర్మించిన సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కల్వర్టును వారు ప్రారంభించారు. అలాగే ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారి పక్కన రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ. 23.94 లక్షలతో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం, రూ. 20.80 లక్షలతో నిర్మించి వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం చేశారు. గాంధీనగర్‌లో రూ. 62 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీ, సుంకులమ్మ గుడి సమీపంలో రూ. 21 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ, గుంజలపాడు రహదారిలో రూ. 20 లక్షలతో నిర్మించిన డ్రైనేజీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేశామన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి నిధుల విడుదలకు ప్రత్యేకంగా కృషి చేయడంతో ఒక్క కోవెలకుంట్ల పట్టణంలోనే రూ. 35 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మెంబర్ కరుణాకర్, ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటింగ్ కమిటీ సభ్యుడు శ్రీనివాసనాయక్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాలమద్దిలేటి, ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఏడీఈ ఖాజావలి, ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఏపీఎం గురుస్వామి, ఈఓపీఆర్‌డీ రాధిక, ఈఓ గోపినాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, ఎల్‌బీసీ రామసుబ్బారెడ్డి, నాట్ల వెంకటేశ్వరరెడ్డి, డీవీ శేషిరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, రఘునాథరెడ్డి, పోతం రాంమోహన్‌రెడ్డి, అమడాల శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సప్తగిరి నాగేశ్వరరెడ్డి, హరినాథరెడ్డి, నాగార్జునరెడ్డి, శ్రీరాముల అబ్రహం, సుబ్బరాయుడు, అక్బర్‌బాషా, రామిరెడ్డి, వీరారెడ్డి, మోహన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, గజ్జెలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ....అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా!

బనగానపల్లె నియోజకవర్గంలో గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి.... మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డికి సవాల్ విసిరారు. తాము చేసిన అభివృద్ధి పనుల్లో గత టీడీపీ హయాంలో కనీసం 20 శాతం పనులు కూడా చేయలేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏమి అభివృద్ధి పనులు చేశారో బహిర్గతం చేయాలని కాటసాని డిమాండ్ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమంతోపాటు అభివృద్ధి పనులు చేస్తుంటే జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా టీడీపీ నాయకులు నీరు- చెట్టు పేరుతో కోట్లాది రూపాయలు దోచుకుని దాచుకున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే ఏమి చేస్తామనే విషయాలు చెప్పకుండా మంత్రులు, ఎమ్మెల్యేలపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కుందూనదిలో నీరు కలుషితమవుతుండడంతో జలజీవన్ మిషన్ ద్వారా 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసి అవుకు రిజర్వాయర్ నుంచి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయబోతున్నామన్నారు. ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించి 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పట్టం కట్టాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని విజ్ఞప్తి చేశారు.

కబడ్డీ పోటీ విజేత ప్యాపిలి జట్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ బుక్కాపురం గ్రామంలో సీతారాములవిగ్రహ ప్రతిష్ట, కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. ప్యాపిలి మండలం బావి పల్లె జట్టు మొదటి స్థానం కై వసం చేసుకోవగా డోన్ మండలం చనుగొండ్ల రెండవ, ఓర్వకల్లు మండలం బ్రాహ్మనపల్లె జట్టు మూడవ స్థానాల్లో నిలిచాయి. అదేవిధంగా పాణ్యం మండలం తమ్మరాజుపల్లె జట్టు నాల్గవ, డోన్ మండలం బొంతిరాళ్ల జట్టు ఐదవ స్థానం కై వసం చేసుకున్నాయి. విజేత జట్లకు వరుసగా రూ. 15వేలు, రూ.10 వేలు, రూ. 7వేలు, రూ. 5వేలు, రూ. 3వేలు చొప్పున బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, గ్రామస్తులు బలరాముడు, లక్ష్మన్, రాజు పాల్గొన్నారు.

నాయినపల్లెలో ఉచిత వైద్యశిబిరం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని నాయినపల్లెలో గురువారం రామ్‌కో సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కంపెనీ వైద్యులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి నెలా కంపెనీ పరిధిలోని గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు.

సంక్షిప్తం

నేడు ప్రెస్ క్లబ్‌కు భూమి పూజ

డోన్ టౌన్ : పట్టణంలోని పాత బస్టాండ్‌లో శుక్రవారం ఉదయం 6 గంటలకు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రెస్ క్లబ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తారని సీనియర్ పాత్రికేయుడు విజయమోహన్ నాయుడు గురువారం తెలిపారు. ఎన్నోఏళ్లుగా పాత్రికేయులు ఎదురు చూస్తున్న కల నేరవేరబోతుందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రింట్, ఎల్రక్టానిక్ మీడియా ప్రతినిధులు భూమి పూజ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

అనాథ ఆశ్రమానికి వృద్ధురాలు

డోన్ టౌన్ : లచ్చమ్మ అనే వృద్ధురాలును గురువారం పట్టణంలోని వైఎస్ నగర్‌లో ఉన్న అనాథ వృద్ధాశ్రంలో స్ఫూర్తి సభ్యులు చేర్పించారు. మండలంలోని ఉడుములపాడులో ఒంటరిగా జీవిస్తూ ఇబ్బందులు పడుతున్న లచ్చమ్మ గురించి గ్రామస్తులు స్ఫూర్తి సంస్థ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన వారు ఆశ్రమ నిర్వాహకులతో సంప్రదించి అక్కడ చేర్పించారు. కార్యక్రమంలో స్ఫూర్తి సంస్థ అధ్యక్షులు మధు,చంద్రమోహన్‌రెడ్డి, యోగి, ఆశ్రమ సూపర్ వైజర్ మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కనకాద్రిపల్లెకు చెందిన రమణారెడ్డి(55) కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు సీఐ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. వారం క్రితం శంకర్‌రెడ్డితో కలిసి రమణారెడ్డి పని నిమిత్తం అంకిరెడ్డిపల్లెకు వెళ్లి స్వగ్రామానికి బయలు దేరారు. మార్గమధ్యలో విండ్‌వరల్డ్ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన రమణారెడ్డిని కుటుంబ సభ్యులు మొదట అనంతపురం తీసుకెళ్లి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

రైల్వేప్లాట్ ఫాంపై గుర్తు తెలియని శవం



కోవెలకుంట్ల: నంద్యాల- ఎర్రగుంట్ల రైల్వేలైన్‌లో స్థానిక రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై గురువారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు..టీషర్టు, జీన్స్ పాయింట్ ధరించిన ఈ వ్యక్తికి 40 సంవత్సరాలకు పైబడి ఉంటాయి. అనారోగ్యంతో మృతిచెందాడా, ఇతర కారణాలా అనే విషయాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మండల పరిధిలోని చిన్న మల్కాపురం సబ్ స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నేపథ్యంలో శుక్రవారం చిన్నమల్కాపురం, రంగాపురం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు, ఫ్యాక్టరీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు కరెంటు ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు. అదే విధంగా వ్యవసాయానికి త్రీఫేస్ కరెంటు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా చేస్తామని తెలిపారు.

ఆర్బీకే,సచివాలయ భవనాలు ముస్తాబు



రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయం



రూ.21.50లక్షలతో నిర్మించిన ఆర్బీకే

- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె రూరల్ : మండలంలోని వెంకటాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ, రైతుభరోసా కేంద్రం ప్రారంభానికి ముస్తాబయ్యాయి. రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.50 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాలను శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభిస్తారని సర్పంచ్ టి.శ్రీహరిత,గ్రామ వ్యసాయ సలహామండలి చైర్మన్ టీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అదేవిధంగా రూ.55 లక్షలతో నిర్మించి సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.